నగరంలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

తనిఖీల్లో పాల్గొన్న ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు, సిబ్బంది

వినాయక్‌నగర్, ఆగస్టు10 : సీపీ ఆదేశాల మేరకు జిల్లాకేంద్రం లోని పలు ప్రధాన కూడళ్ల వద్ద వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో విజయ్ బాబు సిబ్బందితో కలిసి శుక్రవారం అర్ధరాత్రి డ్రంక్ అండ్ డ్రైవన్ తనిఖీలు చేపట్టారు. నగరంలోని దేవీరోడ్డు చౌరస్తా, అర్సపల్లి ఏరియాలో మద్యం సేవించి వాహనాలు నడిపే వారికి బ్రీత్ ఎనలైజర్‌తో పరిశీలించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిని గుర్తించి, వాహనాలను సీజ్ చేశారు. పట్టుబడిన వారిని కోర్టులో హాజరు పర్చనున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు. కోర్టులో విధించే ఫైన్ కట్టిన అనంతరం వారి వాహనాన్ని అందజేస్తామని తెలిపారు.

ఆగి ఉన్న లారీని ఢీకొని వ్యక్తి మృతి

వినాయక్‌నగర్, ఆగస్టు 10 : జిల్లాకేంద్రంలో రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని ద్విచక్రవాహంతో ఢీకొట్టిన వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజాంకాలనీకి చెందిన అన్వర్ (42) ద్విచక్రవాహనంపై అర్సపల్లి బైపాస్ రోడ్డు నుంచి రైల్వే పట్టాల పక్కన ఉన్న కూరగాయల మార్కెట్‌కు శనివారం బయల్దేరాడు. మార్గంమధ్యలో రోడ్డు పక్కన నిలిపి ఉన్న లారీని ఢీకొట్టడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు ప్రభుత్వ దవాఖానకు తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేపడుతున్నారు.

జోస్ ఆలుక్కాస్ వార్షికోత్సవాలు ప్రారంభం

ఖలీల్‌వాడి, ఆగస్టు 10 : జోస్ ఆలుక్కాస్ జ్యువెల్లరీ షోరూం 60వ వార్షికోత్సవాలను నగర మేయర్ దండు నీతూకిరణ్ జిల్లా కేంద్రంలోని షోరూంలో శనివారం ప్రారంభించారు. ఉత్సవాల సందర్భంగా వినియోగదారులకు ఆరు వారాల పాటు లక్కీడ్రా ద్వారా రూ.6 కోట్ల విలువ చేసే బహుమతులు అందించనున్నట్లు షోరూం ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో బీఎం ధనీష్, ఫ్లోర్ మేనేజర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఢిల్లీలో 'స్వాతంత్ర్య' వేడుకలకు పాతంగల్ రైతులకు ఆహ్వానం

పోతంగల్,ఆగస్టు 10: దేశ రాజధాని ఢిల్లీలో ఈ నెల 15న నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు పాతంగల్ మండలానికి చెందిన ఇద్దరు రైతులకు ఆహ్వానం అందినట్లు బోధన్ ఏకచక్రపుర కిసాన్ రైతు ఉత్పత్తి దారుల సంఘం సీఈవో మహేందర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోతంగల్ మండలం హంగర్గాఫారానికి చెందిన రైతు దిలీప్, హెగ్డోలి గ్రామానికి చెందిన రైతు అర్జున్‌రావుకు ఆహ్వానం అందినట్లు పేర్కొన్నారు. రైతుల దంపతులను ఈనెల 13న ఢిల్లీకి తీసుకువెళ్లనున్నట్లు పేర్కొన్నారు.

పంట కాలువలు కబ్జా

- మట్టితో పూడ్చివేయడంతో కింది పంటలకు అందని సాగునీరు
- చర్యలు తీసుకోవాలని కోరుతున్న మల్కాపూర్ తండా రైతులు

కబ్జాకు గురై మట్టితో పూడ్చివేసిన పంట కాలువ

సారంగాపూర్, ఆగస్టు 10 : నిజామాబాద్ రూరల్ మండలంలోని మల్కాపూర్ తండా మౌలాలి రిజర్వాయర్‌కు చెందిన పంట కాలువలు మట్టితో పూడ్చివేసి కబ్జాకు గురయ్యాయి. దీంతో మౌలాలి రిజర్వాయర్ నుంచి అలుగు ద్వారా వస్తున్న నీరు పంట కాలువల గుండా కింది ఆయకట్టు ప్రాంతం వరకు వెళ్లకుండా మధ్యలోనే ఆగిపోతున్నాయి. మట్టితో పూడ్చివేతకు గురైన కాలువ నీరు కింది భాగం వైపు వెళ్లకుండా పక్కనే ఉన్న పొలాల్లోకి వచ్చి చేరడంతో పంటలకు నష్టం వాటిల్లుతున్నదని తండాకు చెందిన బాధిత రైతులు వాపోతున్నారు. ఈ విషయమై కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతుతోపాటు నీటిపారుదల శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు.

40 ఏండ్ల క్రితం రిజర్వాయర్ మొదటి తూము నుంచి మట్టితో కూడిన పంట కాలువ సిమెంట్ పైపులతో ఉండడంతో వరద, అలుగునీరు కింది భాగం వరకు ఉన్న కొత్తపేట శివారు గుండా ముత్తకుంట శివారులోని బాలమ్మ వాగులోకి చేరేవి. ఈ పంట కాలువ మధ్యలో కొందరు రైతులు కాలువలోని పైపులు తొలగించి, మట్టితో పూడ్చి వరి పంట సాగు చేస్తున్నారు. మొదటి తూము పంట కాలువతోపాటు రెండో తూము పంట కాలువను కూడా అక్కడక్కడ కబ్జాకు పాల్పడి, పంట సాగు చేస్తున్నారని గ్రామస్తులు తెలిపారు. పంట కాలువల్లో ప్రస్తుతం పిచ్చిమొక్కలు, మట్టితో పేరుకుపోయి ఉన్నదని, వాటిని శుభ్రం చేయిండంతోపాటు కబ్జాకు గురైన పంట కాలువల పూడికను తొలగించి, కింది భాగం వరకు సులువుగా వెళ్లేందుకు అధికారులు తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రెవెన్యూ అధికారులతో సర్వే చేయించి, కబ్జాను తొలగిస్తాం

పంట కాలువ కబ్జాకు గురైంది వాస్తవమే. ఇటీవల మౌలాలి రిజర్వాయర్ అలుగును పరిశీలించేందుకు వెళ్లగా గ్రామపెద్దలు పంట కాలువకు కబ్జాకు గురైన విషయాన్ని మా దృష్టికి తెచ్చారు. మట్టితో కాలువను పూడ్చి కబ్జాకు గురైన స్థలాన్ని పరిశీలించాం. రెవెన్యూ అధికారులతో పంట కాలువలకు మొత్తం సర్వే చేయిస్తాం. కబ్జాకు గురైన పంట కాలువలను కాపాడుతాం.

- బాల్‌రాజ్, నీటిపారుదల శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్

భక్తిశ్రద్ధలతో 'శ్రావణ' పాదయాత్ర

సుభాష్‌నగర్, ఆగస్టు 10 : శ్రావణ మాస మొదటి శనివారం పురస్కరించుకొని శ్రావణ దీక్ష బృందం శనివారం రైల్వేగేట్ సార్వజనిక్ గణేశ్ మండలి ఆలయంలో ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం కాలినడకన సారంగాపూర్ హనుమాన్ ఆలయానికి చేరుకున్నారు. సంప్రదాయ దుస్తులు ధరించి, జైశ్రీరాం.. జై హనుమాన్ నామస్మరణతో పాదయాత్ర చేపట్టారు. దీక్షా బృందం ప్రతినిధి రాజ్‌కుమార్ సుబేదార్ మాట్లాడుతూ.. 12 ఏండ్లుగా శ్రావణ మాసంలో పాదయాత్ర చేపట్టి నీలకంఠేశ్వరాలయం, సారంగాపూర్ హనుమాన్ ఆలయాలను దర్శించుకొని, పూజలు చేస్తున్నట్లు తెలిపారు.

ఆరోగ్యమేళాకు విశేష స్పందన

- పరిశీలించిన డీఎంహెచ్‌వో రాజశ్రీ

డిచ్‌పల్లిలో వైద్యులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో రాజశ్రీ

డిచ్‌పల్లి/ ధర్పల్లి / ఖలీల్‌వాడి, ఆగస్టు 10: డిచ్‌పల్లి మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన ఆరోగ్యమేళాకు విశేష స్పందన లభించింది. కార్యక్రమాన్ని డీఎంహెచ్‌వో రాజశ్రీ పరిశీలించారు. ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంలో భాగంగా ప్రతినెలా 2వ శనివారం ప్రత్యేక వైద్యనిపుణుల ఆధ్వర్యంలో నిర్వహించే ఆరోగ్యమేళాను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రోగులతో మాట్లాడి ఆరోగ్యమేళాలో అందుతున్న సేవలను తెలుసుకున్నారు. స్త్రీ వైద్య నిపుణురాలు డాక్టర్ సుష్మ, దంత వైద్య నిపుణురాలు సరిత గ్రేస్ రోగులకు వైద్యసేవలందించారు.

ధర్పల్లి మండలకేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో నిర్వహించిన ఆరోగ్యమేళాకు భారీ స్పందన వచ్చింది. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖాన నుంచి స్త్రీ వైద్య నిపుణులు మహిళలను పరీక్షించి అవసరమైన సూచనలు చేసి, మందులు అందజేశారు. స్త్రీ వైద్య నిపుణురాలు డాక్టర్ రమ్య, జనరల్ సర్జన్ డాక్టర్ నిఖిత ఆరోగ్యమేళాకు తరలివచ్చిన సుమారు 130 మంది మహిళలు, చిన్నారులను పరీక్షించి, రక్తపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కొంతమందిని జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారిణి మౌనిక, నర్సింగ్ ఆఫీసర్ అరుణలత, వైద్యసిబ్బంది సృజన, మేరీ, జయ, కృష్ణ, వాజిద్, సంతోష్, మురళి పాల్గొన్నారు.

రూరల్ మండలంలోని తిర్మన్‌పల్లి పీహెచ్‌సీని డీఎంహెచ్‌వో శనివారం తనిఖీ చేశారు. సమయ పాలన పాటించాలని, పీహెచ్‌సీ పరిసరాలను శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులకు సరిపడా మందులను అందుబాటులో ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో చందర్, ఎంఎల్‌హెచ్‌పీ అఖిల్, హెచ్‌ఈవో నాగరాజు, సూపర్‌వైజర్ మధుకర్ పాల్గొన్నారు.

పుంజాల శివశంకర్‌కు నివాళి

శివశంకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తెలంగాణ మున్నూరుకాపు ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం

ఖలీల్‌వాడి, ఆగస్టు 10 : గవర్నర్, కేంద్రమంత్రిగా ఉండి పేదల కోసం ఎన్నో పథకాలు అమలుచేసిన పుంజాల శివశంకర్ 95వ జయంతిని తెలంగాణ మున్నూరుకాపు ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. నగరంలోని ప్రగతినగర్ మున్నూరుకాపు కల్యాణ మండపంలో శివశంకర్ చిత్రపటానికి జిల్లా జిల్లాఅధ్యక్షుడు తోట రాజశేఖర్, సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రవి, లింబాద్రి, చిట్టి నారాయణ రెడ్డి, ఆకుల చిన్నరాజేశ్వర్, సాయికుమార్, అర్జున్, శేఖర్, గోవర్ధన్, హరిదాస్, సాయిరెడ్డి, రవీందర్, లింగం పాల్గొన్నారు.

ఇందూరు తిరుమలకు రామజోగయ్య శాస్త్రి గోదానం

మోపాల్ (ఖలీల్‌వాడి), ఆగస్టు 10 : మోపాల్ మండలంలోని నర్సింగ్‌పల్లిలో ఉన్న ఇందూరు తిరుమల ఆలయానికి ప్రముఖ సినీ గేయరచయిత రామజోగయ్యశాస్త్రి గోవును శనివారం దానం చేశారు. ఇందూరు తిరుమలలోని గోవింద వనమాల క్షేత్రంలో ఉన్న గోశాలకు గోదానం చేశారని ఆలయ ప్రధానధర్మకర్త శ్రీమాన్ నర్సింహారెడ్డి తెలిపారు. ఆధ్యాత్మిక ప్రకృతి సేద్యాన్ని చూసేందుకు ఆయన త్వరలో ఇందూరు తిరుమలను దర్శనం చేసుకుంటారని తెలిపారు.

రైతు ఆత్మహత్యపై నిజనిర్ధారణ కమిటీ

- బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని కోరిన కార్మిక సంఘం ప్రతినిధులు

జక్రాన్‌పల్లి, ఆగస్టు 10 : మండలంలోని అర్గుల్‌కు చెందిన రైతు కుంట రాజేశ్ ఈనెల 8న తన సొంత భూమిలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకోగా.. అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం, అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం ప్రతినిధులు శనివారం నిజనిర్ధారణ సేకరణ చేశారు. కార్మిక సంఘం ప్రతినిధులు వి.ప్రభాకర్, బి. దేవారం, సురేశ్, బాబన్న, గంగారాం, గంగాధర్, దేవన్న, నరేందర్, అనిల్‌కుమార్ గ్రామంలో శనివారం పర్యటించి, ప్రముఖులు, బాధిత కుటుంబీకులతో మాట్లాడి వివరాలను సేకరించారు. ఫైనాన్స్ పేరిట వడ్డీ వ్యాపారులు వేధింపులకు గురిచేయడం, భూమి తన పేరిట ఆన్‌లైన్‌లో లేకపోవడంతోనే మృతిచెందాడని తెలిపారు. వేధింపులకు గురి చేసిన వడ్డీ వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. రైతు ఆత్మహత్యలను నివారించడానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని పంటలకు రూ. 500 బోనస్, మద్దతు ధర ఇవ్వాలని, ఏకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు.

వయనాడ్ బాధితుల కోసం విరాళాల సేకరణ

చందూర్, ఆగస్టు 10 : కేరళ రాష్ట్రంలోని వయనాడ్ వరద బాధితుల కోసం చందూర్‌లో సీఐటీయూ నాయకులు శనివారం విరాళాలు సేకరించారు. వరదల్లో ఎంతోమంది మరణించారని, వారికి చేయూతచ్చేందుకు సహకరించాలని కోరారు. నాయకులు సాయిబాబా, భూమయ్య, రాజయ్యపాల్గొన్నారు.

గాడితప్పిన చెత్త సేకరణ

పనిచేయని చెత్త ఆటోలు.. రోజు విడిచి రోజు చెత్త సేకరణ

నగరంలో చెత్త సేకరిస్తున్న మున్సిపల్ కార్మికులు (ఫైల్)

కంఠేశ్వర్, ఆగస్టు 10 : జిల్లాకేంద్రంలో చెత్తసేకరణ గాడితప్పింది. పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించే అధికారుల తీరు మాటలకే పరిమితమవుతున్నదని నగరవాసులు విమర్శిస్తున్నారు. కార్పొరేషన్ పరిధిలో మొత్తం 60 డివిజన్లలో ఇంటింటి చెత్త సేకరణకు 67 ఆటోలు, ట్రాక్టర్లు 32 అందుబాటులో ఉన్నాయి. డివిజన్‌కు ఒక ఆటోచొప్పున తిరిగినా ప్రతిరోజూ చెత్తసేకరణ జరుగుతుంది. నగరంలో కొన్ని ఏరియాల్లో ఇంటింటి చెత్త సేకరణ ఆటోలు ప్రతిరోజూ రావడం లేదని, రోజు విడిచి రోజు వచ్చినా ఏ సమయంలో వస్తున్నాయో తెలియడం లేదని ప్రజలు వాపోతున్నారు. కంఠేశ్వర్ బ్యాంక్ కాలనీలో కొన్ని వారాల నుంచి ఇంటింటి చెత్తసేకరణ సరిగా జరగడం లేదు. ఒకరోజు ఉదయం 7 గంటలకే వస్తే, మరొకరోజు మధ్యాహ్నం 11, 12 గంటల ప్రాంతంలో వస్తున్నాయి. దీంతో ఉద్యోగాలకు వెళ్లే వారు చెత్తను ఆట్లోల్లో వేయలేకపోతున్నారు. రోజూ ఎందుకు ఆటోలు రావడంలేదని డ్రైవర్లను అడిగితే చెత్త సేకరించే ఆటోలు పాడైనాయి, రిపేరుకు ఇచ్చామని చెబుతున్నారని ప్రజలు పేర్కొన్నారు. చెత్తసేకరణ వాహనాలు రోజూ ఒకే సమయానికి వచ్చేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ఆటోలకు రిపేర్ చేయిస్తున్నాం..

ఇంటింటి చెత్తసేకరణకు 67 ఆటోలు, 32 ట్రాక్టర్లు అందుబాటులో ఉన్నాయి. కొన్ని పాడైన ఆటోలకు చిన్న చిన్న రిపేర్లు చేయిస్తున్నాం. మరికొన్ని ఆటోల రిపేరుకు సమయం పడుతుంది.

- రాజేంద్రకుమార్, మున్సిపల్ డిప్యూటీ కమిషనర్

త్రయంబక్‌పేట్‌ను జీపీ చేయాలి

- రూరల్ ఎమ్మెల్యేకు గ్రామస్తుల వినతి

ఎమ్మెల్యేతో మాట్లాడుతున్న త్రయంబక్‌పేట్ గ్రామస్తులు

ఇందల్వాయి, ఆగస్టు 10 : మండలంలోని రంజిత్‌నాయక్ తండా జీపీలో ఉన్న త్రయంబక్‌పేట్‌ను గ్రామపంచాయతీగా ఏర్పాటుచేయాలని కోరుతూ ఆ గ్రామస్తులు రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డికి శనివారం వినతిపత్రాన్ని అందజేశారు. పథకాలు అందడంలో, అభివృద్ధి, రాజకీయంగా చాలా విషయాల్లో గ్రామానికి అన్యాయం జరుగుతున్నదని, ప్రభుత్వం ద్వారా వచ్చే నిధులు అందడం లేదని విన్నవించారు.

'రెడ్డి సంఘానికి నిధులు కేటాయించాలి'

మోపాల్ (ఖలీల్‌వాడి), ఆగస్టు 10 : రూరల్ క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డిని ఠానాకుర్దూ గ్రామానికి చెందిన రెడ్డి సంఘం ప్రతినిధులు శనివారం కలిశారు. గ్రామంలో నిర్మిస్తున్న రెడ్డి సంఘానికి, రోడ్ల అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు.

సంక్షిప్తంగా..

- **13న లడ్డూ, పులిహోర ప్రసాదాల విక్రయానికి వేలం:** శక్కర్‌నగర్, ఆగస్టు10: బోధన్ పట్టణంలోని శ్రీ చక్రేశ్వర శివమందిరంలో లడ్డూ, పులిహోర ప్రసాదాల విక్రయాలకు ఈనెల 13న ఉదయం 11 గంటలకు వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో శ్రీరాం రవీందర్ గుప్తా, జూనియర్ అసిస్టెంట్ రాములు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండేండ్ల కాల పరిమితికి గాను నిర్వహించే వేలంలో పాల్గొనే వారు రూ. 10వేలు డిపాజిట్ చేసి, ఆలయంలో పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు. ఆలయంలో ఉదయం 11గంటలకు వేలం నిర్వహించనున్నట్లు ఈవో తెలిపారు.
- **నవీపేట ఎస్సైగా వినయ్‌కుమార్:** నవీపేట,ఆగస్టు 10: నవీపేట ఎస్సైగా కే. వినయ్‌కుమార్ నియమితులయ్యారు. ఇదివరకు ఇక్కడ పనిచేసిన యాదగిరిగౌడ్ మోపాల్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీపై వెళ్లగా.. వేల్పూర్ ఎస్సై వినయ్‌కుమార్ నవీపేట కు బదిలీపై రానున్నారు.

డీసీఎం చోరీకి దుండగుల యత్నం

- అడ్డుకున్న యువకులపై ఎదురుదాడి
- రెంజల్ మండలం బోర్గాం శివారులో ఘటన

రెంజల్, ఆగస్టు 10 : మండలంలోని బోర్గాం శివారులో సాటాపూర్ గ్రామానికి చెందిన సిమెంట్ బ్రిక్ షెడ్డు వద్ద నిలిపి ఉంచిన డీసీఎంను గుర్తుతెలియని దుండగులు శుక్రవారం అర్ధరాత్రి చోరీ చేసేందుకు బైక్‌పై వచ్చారు. అక్కడే నిద్రిస్తున్న ముగ్గురు యువకులు గమనించారు. తాళం కోసం వెతుకుతున్న దుండగులను పట్టుకునేందుకు యత్నించగా.. వారు బైక్‌పై కందకుర్తి వైపు పారిపోయారు. దీంతో షేక్ సాబిద్, అమ్జద్ ఖాన్, సత్తార్ బైక్‌లపై వెంబడించి నీలా శివారులో ఉన్న రోజ్ గార్డెన్ ఫంక్షన్ హాలు వద్ద దుండుగలను పట్టుకున్నారు. ఈ క్రమంలో షేక్ సాబిద్, అమ్జద్‌ఖాన్‌పై ఎదురుదాడి చేసిన దుండగులు వారు తెచ్చుకున్న బైక్‌ను అక్కడే వదిలేసి పారిపోయారు. వదిలేసిన బైక్‌ను పోలీసులు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రెంజల్ పోలీసులు తెలిపారు.

ఏపుగా పెరిగి.. నరికివేతకు గురై..

రోడ్డుపక్కన కొమ్మలు లేకుండా దర్శనమిస్తున్న చెట్లు

ఏర్గట్ల-రాంపూర్ మధ్య నరికివేతకు గురైన చెట్లు

మోర్తాడ్, ఆగస్టు 10: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన హరితహారం కార్యక్రమంలో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో రోడ్ల పక్కన నాటిన మొక్కలు నేడు వృక్షాలుగా మారాయి. అవి వాహనదారులకు ఆహ్లాదం పంచుతున్నాయి. ఏపుగా పెరిగిన ఆ చెట్లను కొందరు నరికివేస్తున్నారు. మొక్క నాటిన నాటి నుంచి అవి పెరిగే వరకు ఎందరి కృషి ఉందోనన్న విషయాన్ని గుర్తించకుండా నరికిపారేస్తుంటే.. అధికారులు మాత్రం చేతులు కట్టుకుని చూస్తుండడం శోచనీయం. పదేండ్ల కృషితో పెరిగిన వృక్షాలను ఒక్కవేటుతో భూమిపాలు చేస్తుంటే చర్యలేమి తీసుకోకుండా.. 'స్వచ్ఛదనం- పచ్చదనం' పేరున మొక్కలు నాటాలని చెప్పడం ఎందుకన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చెట్లు నరికిన వారిపై చర్యలు తీసుకుని ఆ స్థానంలో మళ్లీ మొక్కలు నాటించేలా చూడాలన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

పట్టణ సమస్యలపై ఎమ్మెల్యే దృష్టి సారించాలి

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ బోధన్ పట్టణ అధ్యక్షుడు రవీందర్‌యాదవ్

విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు

బోధన్, ఆగస్టు 10: బోధన్ పట్టణంలో నెలకొన్న సమస్యల పరిష్కారంపై స్థానిక ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి దృష్టి సారించాలని బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గాండ్ల రవీందర్ యాదవ్ అన్నారు. శనివారం ఆయన పట్టణంలోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. పలు వార్డుల్లో వీధికుక్కల బెడద ఎక్కువైందని తెలిపారు. రెండు రోజులు క్రితం హనుమాన్ టెక్డీలో ఆరుబయట ఆడుకుంటున్న ఓ చిన్నారిపై కుక్కలు దాడిచేసి తీవ్రంగా గాయపరిచాయన్నారు. ఈ విషయంలో తమతోపాటు స్థానికులు కూడా మున్సిపల్‌లో ఫిర్యాదు చేశారని తెలిపారు. వర్షాలకు వార్డుల్లోని రోడ్లపై గుంతలు ఏర్పడడంతో ప్రజలు నడవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గతంలో ప్రతి ఏడాది వర్షాకాలంలో మొరం వేయించేవారని, ప్రస్తుతం మున్సిపాలిటీలో స్పందించే వారే కరువయ్యారని అన్నారు. సమస్యల పరిష్కారానికి మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లతో సమీక్ష నిర్వహించాలని ఎమ్మెల్యేను కోరారు. సమావేశంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బెంజర్ గంగారాం, పార్టీ సీనియర్ నాయకుడు కేవీ సత్యం, మైనార్టీ రాష్ట్ర నాయకుడు ఎంఏ రజాక్, కార్మిక విభాగం పట్టణ అధ్యక్షుడు రవిశంకర్ గౌడ్, నాయకులు ప్రవీణ్ జాదవ్, అహ్మద్, సాగర్, షేక్ జాకీర్ అహ్మద్ పాల్గొన్నారు.

బాధితులకు సెల్‌ఫోన్ల అందజేత

వినాయక్‌నగర్/ రెంజల్, ఆగస్టు 10 : నిజామాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో ట్రైన్‌లో ప్రయాణించి, సెల్‌ఫోన్లను పోగొట్టుకోగా.. సీఐఈఆర్ సహాయంతో రికవరీ చేసినట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. బాధితులను సెల్‌ఫోన్లను శనివారం ఆయన అందజేశారు. అప్పగించారు. రెంజల్ మండలంలోని నీలా క్యాంప్ గ్రామానికి చెందిన ఆంజనేయులు ఇటీవల తన సెల్‌ఫోన్‌ను పోగొట్టుకోగా.. రెంజల్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా మొబైల్ ఫోన్‌ను గుర్తించి, ఎస్సై సాయన్న శనివారం బాధితుడికి అందజేశారు.

కోటగిరి ఎంపీడీవో బదిలీ

కోటగిరి, ఆగస్టు 10 : కోటగిరి ఎంపీడీవో మనోహర్‌రెడ్డి బదిలీ అయ్యారు. ప్రస్తుతం ఎంపీవోగా విధులు నిర్వర్తిస్తున్న చందర్‌కు ఇన్‌చార్జి ఎంపీడీవోగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. చందర్ ఇన్‌చార్జి ఎంపీడీవోగా సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. మనోహర్‌రెడ్డికి ఇంకా పోస్టింగ్ కేటాయించలేదు.

ట్రీ గార్డులు ఏర్పాటు చేయాలి

ఏర్గట్ల, ఆగస్టు 10: మండలంలోని ఎనిమిది గ్రామాల్లో స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమంలో భాగంగా నాటిన మొక్కలకు ట్రీ గార్డులు ఏర్పాటు చేయాలని పంచాయతీ కార్యదర్శులకు ఎంపీవో శివచరణ్ సూచించారు. మండలంలోని అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు మొక్కల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

మాక్లూర్, ఆగస్టు 10: మండలంలోని దాస్‌నగర్‌లో ఉన్న పెట్రోల్‌బంక్ సమీపంలో స్థానికుల సమాచారం మేరకు పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం దాడి చేసినట్లు మాక్లూర్ ఎస్సై లక్ష్మణ్ తెలిపారు. ముగ్గురు పట్టుబడగా.. మరో ముగ్గురు పరారైనట్లు తెలిపారు. వారి నుంచి రూ.3,740 నగదును స్వాధీనం చేసుకొని, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆర్టీసీ శ్రావణమాసం ఆఫర్

రాయితీపై అద్దెకు బస్సులు

శక్కర్‌నగర్, ఆగస్టు 10: శ్రావణమాసం సందర్భంగా ఆర్టీసీ ప్రత్యేక ఆఫర్ ప్రకటించింది. బస్సులను అద్దెకు తీసుకునే వారికి పదిశాతం రాయితీపై అందించనున్నట్లు బోధన్ ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎటువంటి డిపాజిట్ చెల్లించకుండా ప్రయాణించే దూరానికి, సమయానికి మాత్రమే చార్జీలు చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈ అవకాశం సెప్టెంబర్ 3వ తేదీ వరకు బుక్ చేసుకునే వారికి మాత్రమే వర్తిస్తుందని తెలిపారు. మిగతా వివరాలకు బోధన్ ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్(73828 40367) లేదా సిస్టం సూపర్ వైజర్ (99856 02789)ను సంప్రదించాలని సూచించారు.

వసతిగృహంలో సౌకర్యాలు కల్పించండి

సిబ్బందిని నిలదీసిన విద్యార్థుల తల్లిదండ్రులు

నందిపేట్, ఆగస్టు 10 : డొంకేశ్వర్ మండలం నూత్‌పల్లి గ్రామంలోని మహాత్మా జ్యోతిబా పూలే సాంఘిక సంక్షేమ వసతిగృహంలో సరైన సౌకర్యాలు లేవని విద్యార్థుల తల్లిదండ్రులు సిబ్బందిని నిలదీశారు. వసతి గృహంలో 8, 9వ తరగతుల విద్యార్థుల తల్లిదండ్రులతో శనివారం సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో విద్యార్థుల తల్లిదండ్రులు హాస్టల్‌లో నెలకొన్న సమస్యలపై ఏకరువు పెట్టారు. సరైన గదులు లేకపోవడం, హాస్టల్‌లోని మురికినీరు బయటికి వెళ్లే మార్గంలేక దుర్గంధం వ్యాపిస్తోందన్నారు. వర్షపు నీరు భవనంలోకి రావడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సిబ్బంది దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు చెబుతామని, సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని ప్రిన్సిపాల్ లక్ష్మణ్ గౌడ్ తల్లిదండ్రులకు భరోసా ఇచ్చారు.

మోర్తాడ్ సీహెచ్‌సీలో ఆరోగ్యమేళా

మోర్తాడ్, ఆగస్టు 10: మోర్తాడ్ క్లస్టర్ దవాఖానలో శనివారం ఆరోగ్యమేళా నిర్వహించారు. శిబిరంలో ఛాతి వైద్య నిపుణుడు రాజేశ్, దంతవైద్యుడు ప్రవీణ్‌కుమార్, చర్మ వ్యాధి నిపుణురాలు జ్యోత్స్న పాల్గొన్నారు. శిబిరానికి విద్యార్థినులు, మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి వైద్యపరీక్షలు చేయించుకున్నారు. రోగులకు వైద్యసలహాలు, సూచనలతో పాటు ఉచితంగా మందులను పంపిణీ చేశారు.

ఎన్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తూ భీమ్‌గల్ మండలంలోని జాగిర్యాల్‌లో దండోరా సంఘసభ్యులు శనివారం మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. సభ్యులు ప్రసాద్, రఘ